
యువకుడి సాహస యాత్ర

- గంగోత్రి నుంచి సాగర సంగమం వరకూ బైక్ యాత్ర
- 18 రోజుల్లో సుమారు 5,150 కిలోమీటర్లు పూర్తి
- గంగా నది పుష్కరాలను పురస్కరించుకుని దివాన్‌చెరువు యువకుని సాహసయాత్ర



గంగా నది పుట్టిన గంగోత్రి వద్ద యోగ సాధన చేస్తూ..

రాజానగరం: దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించి, అక్కడి విశేషాలను సేకరించడం అతనికి అలవాటు. ఏడాదిలో ఒకసారి ఈవిధంగా చేసే యాత్రను ఈసారి గంగా నది పుష్కరాల సందర్భంగా ఆ నది పుట్టిన ప్రాంతం నుంచి సముద్రంలో కలిసే ప్రాంతం వరకూ పర్యటించాలనుకున్నాడు. తన బైకుపై 18 రోజుల పాటు సుమారు 5,150 కిలోమీటర్లు సాగిన ఈ యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని స్వగ్రామానికి చేరుకున్నాడు రైడర్‌గా పేరొందిన దివాన్‌చెరువుకు చెందిన పెన్నాడ మోహన్. ఈ సందర్భంగా తన యాత్ర విశేషాలను 'సాక్షి'తో పంచుకున్నాడు.

సంచార యోగి

రాజానగరం మండలం దివాన్‌చెరువుకు చెందిన పెన్నాడ మోహన్‌కు దేశ సంచారం అంటే ఎంతో ఇష్టం. తన 25 ఏట దేశ సంచారాన్ని ప్రారంభించి, గత ఎనిమిదేళ్లుగా భారత్‌దేశంలోని 23 రాష్ట్రాల్లో సుమారు 42 వేల కిలోమీటర్లు ప్రయాణించి, వివిధ దర్శనీయ ప్రాంతాలను, క్షేత్రాలను సందర్శించి 'సంచార యోగి'గా పేరొందాడు.

గంగా నది యాత్ర

గంగా నది పుష్కరాలను పురస్కరించుకుని ఈ సారి గంగా నది యాత్రను చేపట్టాడు. గంగా నది పుట్టిన హిమాలయ ప్రాంతం గోముఖ్, గంగోత్రి నుంచి ఉత్తర కాశీ, దేవ్ ప్రయాగ, గంగని, హర్సిల్, హరిద్వార్, రుషికేష్, త్రివేణి సంగమం, ప్రయాగరాజ్, వారణాసి మీదుగా గంగానది సాగర సంగమం చేసే పశ్చిమ బెంగాల్‌లోని గంగా సాగర్ వరకూ ఉన్న వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శించాడు. గంగా తీరం వెంబడి ఉన్న ఘాట్‌లలో పుష్కర స్నానాలు ఆచరించి, 18 రోజుల్లో 5,150 కిలోమీటర్ల యాత్రను పూర్తి చేశాడు.

నదీ పుష్కరాల సందర్శనం

దేశ సంచారం చేయాలనే తన సంకల్పానికి 2015లో వచ్చిన గోదావరి మహాపుష్కరాలను ఉపయోగించుకున్నాడు మోహన్. ఆయా నదులు పుట్టిన ప్రాంతాన్ని సందర్శించి, తీరంలో ఉన్న వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శించి, వాటి విశిష్టతలను తెలుసుకుని, రికార్డు చేసుకోవడం అలవాటుగా పెట్టుకున్నాడు. అప్పటి నుంచి దేశంలో ఏ నదికి పుష్కరాలు వచ్చినా ఆయా ప్రాంతాలను సందర్శించడం ఆనవాయితీ చేసుకున్నాడు. ఈ క్రమంలో 2016లో కృష్ణ, 2017 కావేరి, 2018లో భీమ, 2019లో బ్రహ్మపుత్ర, 2020లో తుంగభద్ర, 2021లో సింధు, 2022లో ప్రాణహిత నదులకు వచ్చిన పుష్కరాల యాత్రలు చేశాడు. వీటితోపాటు ఆర్టికల్ 370 రద్దు తరువాత శ్రీనగర్‌లో పరిస్థితులను అధ్యయనం చేయడంలో భాగంగా 2021 డిసెంబర్‌లో తన మోటార్ సైకిల్‌పై ఉత్తర భారతదేశంలోని ఢిల్లీ, హర్యానా, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ అండ్ కశ్మీర్ రాష్ట్రాల్లో నెల రోజులపాటు సుమారు 5 వేల కిలోమీటర్లు ప్రయాణించాడు. హిమాలయ శిఖరాలను, బౌద్ధ దేవాలయాలు, స్వర్ణ దేవాలయం, జమ్మూ మశీదు, కాత్రాలోని వైష్ణవీ మాత ఆలయాన్ని సందర్శించి, చంబ, కాంగండ, కశ్మీర్ లోయలలో మోటార్ సైకిల్‌తో రైడింగ్ చేశాడు. ఆ తరువాత 2022 మే నెలలో గోదావరి పరిక్రమ యాత్రను రాజమహేంద్రవరం నుంచి చేపట్టి, గోదావరి పుట్టిన నాసిక్‌ను సందర్శించి 21 రోజుల్లో సుమారు 4 వేల కిలోమీటరు పర్యటించి, పూర్తి చేశాడు.



కాశీలో గంగా ఘాట్ల వద్ద..

'లోక సంచారి' స్ఫూర్తినిచ్చింది



చిన్నతనం నుంచీ యాత్రలు చేయడమంటే ఎంతో ఇష్టం. రాహుల్ సాంకృత్యాయన్ రాసిన 'లోక సంచారి' పుస్తకం చదివిన తరువాత ఆ ఇష్టం మరింత పెరిగింది. గంగా నదిని సందర్శించడం, తీరం వెంబడి పయనించడం జీవితంలో మధురమైన ఘట్టాలుగా నిలిచాయి. గంగోత్రిలో రాత్రి చలి (-2 డిగ్రీలు)లో నిద్రించడం, అదే చలిలో నదిలో ఉదయం స్నానమాచరించడం గుర్తుకొస్తేనే వణుకు వస్తుంది. హరిద్వార్‌లో గంగా హారతి, రుషికేష్‌లో వివిధ యోగాశ్రమాలు సందర్శించి, యోగ సాధన చేశాను. కాశీలో 82 ఘాట్లు సందర్శించాను. కోల్‌కతాలో విద్యుత్ కాంతుల్లో హౌరా బ్రిడ్జిని చూడడం, సాగర సంగమం వద్ద స్నానం చేయడం అద్భుతమైన ఘట్టాలు.

– పెన్నాడ మోహన్, యాత్రికుడు

వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా నితిన్‌రెడ్డి



మల్లిడి నితిన్‌రెడ్డి

అనపర్తి: వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా అనపర్తికి చెందిన మల్లిడి నితిన్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రకటించారు. తనను ఆ పదవికి ప్రతిపాదించిన ఎమ్మెల్యేకు నితిన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని చెప్పారు. నితిన్ రెడ్డిని జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, వెంకటరెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీరరాఘవరెడ్డి తదితరులు అభినందించారు.

ఘనంగా శ్రీలక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ఠ

బిక్కవోలు: ఊలపల్లిలో శ్రీలక్ష్మీ గణపతి ఆలయ పునర్నిర్మాణంతో పాటు విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం గురువారం ఉదయం స్వామి వారి విగ్రహం ప్రతిష్ఠించారు. స్వామివారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు రమ్య, ఎంపీటీసీ సభ్యులు బండారు శివ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి పోతుల ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చురుగ్గా ధాన్యం కొనుగోళ్లు



ఉండేశ్వరపురంలో ధాన్యం లారీపై తరలిస్తున్న దృశ్యం

సీతానగరం: గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చురుగ్గా సాగుతున్నాయి. గురువారం ఉండేశ్వరపురంలో ధాన్యం కొనుగోలు చేసి లారీపై తరలించారు. మండల వ్యవసాయాధికారి కె.సూర్యరమేష్ మాట్లాడుతూ మిర్తిపాడు, ఉండేశ్వరపురంలలో 600 ఎకరాల్లో వరి పండించారని, మిర్తిపాడులో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు జరిగాయన్నారు. ఉండేశ్వరపురంలో మరో రెండు లోడుల ధాన్యం ఉందని, దానిని రెండు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు జొన్నలగడ్డ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి విశల్, వీఆర్వో విజయశ్రీ, వీహెచ్‌ఏ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై పోరాటం

గోకవరం: జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ డిపోల్లోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు పైడిమళ్ల లక్ష్మణ్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు, ప్రమోషన్ల విషయంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులపై అవమానాలు జరుగుతున్నాయన్నారు. దీనిపై నిరంతర పోరాటం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతానగరం: వార్షిక మరమ్మతుల నేపథ్యంలో మిర్తిపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ చంద్రమోహన్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఉండేశ్వరపురం, మిర్తిపాడు, బొబ్బిల్లంక, ములకల్లంక, కోరుకొండ మండలం మధురపూడి అగ్రికల్చర్ సర్వీస్‌లకు విద్యుత్‌ని నిలిపివేస్తామన్నారు.

17న మండల సర్వసభ్య సమావేశం

గోకవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో ఈ నెల 17న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కేవీఎస్ఎస్ఎస్ మూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన జరిగే సమావేశంలో అభివృద్ధి పనులు, ప్రజాసమస్యలపై చర్చిస్తారన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

670 మందికి వైద్య పరీక్షలు



పురుషోత్తపట్నంలో మంచంపై ఉన్న రోగికి వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: పురుషోత్తపట్నంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు 670 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. బీపీ, సుగర్, జ్వరాల బారిన పడిన వారికి అవసరమైన పరీక్షలు చేశారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి సేవలందించారు. అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించి, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేశారు ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రత్నకుమారి, ఏఎన్ఎం జ్యోతి, ఆశావర్కర్లు ఎస్ కుమారి, పి.లక్ష్మి, వి.లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు నిర్దిష్ట ప్రణాళికతో చదవాలి

రంగంపేట: విద్యార్థులు నిర్దిష్ట ప్రణాళికతో చదివి, అనుకున్న లక్ష్యాలను సాధించాలని లైబ్రేరియన్ ఎస్.రామకోటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులకు గురువారం హాజరైన విద్యార్థులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. శరీరానికి యోగా మాదిరిగానే మెదడుకు పుస్తక పఠనం అవసరమని చెప్పారు. విద్యార్థులకు తెనాలి రామకృష్ణుడి కథలు చెప్పారు. యోగా, ధ్యానం చేయించారు. గణితంలో మెళకువలపై కె.దుర్గాప్రసాద్, జనరల్ నాలెడ్జిపై టి.వీనీంద్ర శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు బాలల గేయాలు ఆలపించారు.

ఎస్‌కేఆర్‌లో ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలు

కంబాలచెరువు: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు ప్రారంభించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి గురువారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, తెలుగు, ఇంగ్లీషు మీడియం, హెచ్‌ఈసీ తెలుగు మీడియం కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 93986 77385, 9866131354 నంబర్లకు సంప్రదించాలన్నారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



కాపవరంలో వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, జక్కంపూడి రాజా, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలోనే సామాజిక న్యాయం సాకారమవుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. కాపవరం గ్రామంలో రూ.17.50 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం భవనాన్ని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలిసి రాజా గురువారం ప్రారంభించారు. వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదల ఆకలి తీరాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని అన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ, ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే పేద వర్గాల కళ్లలో వెలుగులు నిండుతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, ప్రజలందరి ఆరోగ్యం కోసం వెల్‌నెస్ సెంటర్‌ను, రైతుల కోసం రైతుభరోసా కేంద్రం వంటివి నిర్మించడం వలన ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి నినాదంతో ప్రభుత్వ పాలన సాగుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు మార్రేళ్ల భీష్ముడు, ఉప సర్పంచ్ పోసిన గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ కర్రి గంగరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీ విభాగం కార్యదర్శి పోతుల ప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● గుర్తుకొస్తున్నాయి..



ఈత కాయలు, తాటి ముంజెల విక్రయాలతో జీవనోపాధి పొందుతున్న ఓ కుటుంబం

జాతీయ రహదారి పక్కన విక్రయానికి సిద్ధంగా ఉంచిన ఈత కాయల గెలలు, తాటి కాయలను కొట్టి ముంజెలు తీసి డజన్ల లెక్కన అమ్ముతున్న దృశ్యాలను చూస్తుంటే మూడు, మూడున్నర దశాబ్దాల కిందటి బాల్యం గుర్తుకొస్తోంది. భుజాన పుస్తకాలతో పాఠశాలలకు మైళ్ల కొద్దీ నడుచుకుంటూ వెళ్లిన రోజులు, సైకిళ్లపై ఇద్దరేసి ప్రయాణించిన రోజులు, వేసవి సెలవులకు అమ్మమ్మల ఇంటికి వెళ్లి, తాతయ్య, మేనమామలు, వారి పిల్లలతో కలిసి తోటల్లో ఆడుకున్న సందర్భాలు, మామిడి కాయలు, తాటి కాయలు కోయించుకొని తిన్న వేళలు.. ఇలా అనేక చిన్ననాటి సంఘటనలు గుర్తుకొస్తున్నాయి. నేటి ఆధునిక సమాజంలో కంప్యూటర్లు, సెల్‌ఫోన్లతోనే లోకంగా భావిస్తున్న ఈ తరం వారికి ఇటువంటి మధురస్మృతుల గురించి తెలియకపోవచ్చు. తమకు మాత్రమే వాటి విలువ, ఆ ఎంజాయ్‌మెంట్ తెలుసు కాబట్టి వీటిని చూస్తుంటే ఆ నాటి రోజులే కళ్ల ముందు కదలాతున్నాయంటున్నారు ప్రస్తుతం ఐదు పదుల దాటిన వయస్కులు. నిజమే కదా..! సాధారణంగా జీవితంలో ఎవరికైనా మధురమైన జ్ఞాపకాలు ఏమిటి అంటే చిన్ననాటి రోజులే.. మరి!!.

– రాజానగరం

బుచ్చయ్యా.. అభివృద్ధిపైనా విమర్శలేనా?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

- నిస్వార్థంగా సేవలందిస్తుంటే ఆరోపణలా?
- రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్

రాజమహేంద్రవరం రూరల్: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి విమర్శలు చేశారని, ఆయన 40 ఏళ్లలో చేయలేని అభివృద్ధిని తాను నాలుగేళ్లలో చేసి చూపించానని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత వ్యాపారాలు మానుకుని, నిస్వార్థంగా ప్రజా సేవ చేస్తున్నానని అన్నారు. నగర పాలక సంస్థను అస్తవ్యస్తం చేసినట్టు ఆరోపించారని, ఆధారాలతో నిరూపించగలరా అని ఎమ్మెల్యే గోరంట్లకు ఎంపీ భరత్ సవాల్ విసిరారు. కంబాల చెరువు వద్ద దండి మార్చ్, నాగుల చెరువులో క్రికెట్ స్టేడియం నిర్మాణాలు సైంటిఫిక్ ఇంజినీర్ల సూచనలతో ఏర్పాటు చేశామని చెప్పారు. 'ఆవ రోడ్డు విస్తరణ మీరు చేయలేక పోయారు. నేను చేసి చూపిస్తున్నాను. మోరంపూడి జంక్షన్ వై ఓవర్ బ్రిడ్జి మీ 40 ఏళ్ల సర్వీసులో సాధించలేకపోయారు. నేను అది సాధించాను' అని ఎంపీ భరత్ అన్నారు. ఏదైనా విమర్శ చేస్తే అర్థవంతంగా ఉండాలని, ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం తగదని చెప్పారు. అభివృద్ధిని చూసి అభినందించకపోయినా ఫర్వాలేదని, కానీ అర్థం పర్థం లేని విమర్శలు చేయడం వల్ల మీకే నష్టం అని ఎమ్మెల్యే గోరంట్లను ఉద్దేశించి ఎంపీ భరత్ అన్నారు. విలేకర్ల సమావేశంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, రాష్ట్ర ఖాదీ బోర్డు వైస్‌చైర్మన్ పిల్లి నిర్మల, రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, మాజీ ఫ్లోర్‌లీడర్ పోలు విజయలక్ష్మి, బర్రే కొండబాబు, టీకే విశ్వేశ్వరరెడ్డి, బిల్డర్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురపూడి: వార్షిక మరమ్మతుల నిమిత్తం కోరుకొండ మండలం గాడాల సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని ఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ గాడాల, మధురపూడి, నిడిగట్ల గ్రామాల్లోని అగ్రికల్చర్ సర్వీసులకు, ఎయిర్‌పోర్టుకు సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

మంచి మాస్టారిని కోల్పోయాం

రాజానగరం: తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించడమే కాదు, వారు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించుటలోను చురుకైన పాత్ర వహించే మా మంచి మాస్టారు ఆచార్య ఎస్.టేకిని కోల్పోవడం 'నన్నయ' యూనివర్సిటీకి తీరని లోటని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ప్రతినిధులు అన్నారు. యూనివర్సిటీ ఓఎస్డీ ఆచార్య ఎస్.టేకి హఠాన్మరణానికి ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డి.అశోక్‌కుమార్, యూనివర్సిటీ శాఖ ప్రతినిధులు జి.ప్రవల్లిక, ఎస్.సంధ్య, ఎం.గణేష్, కె.విక్రమ్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం తాము చేసిన ఉద్యమాలు, పోరాటాల సమయంలో యూనివర్సిటీ పెద్దలకు, విద్యార్థులకు మధ్య వారధిలా వ్యవహరించి, పరిష్కారానికి ఆయన ఎంతో కృషి చేసేవారన్నారు. ఆయన మృతికి సంతాపాన్ని వ్యక్త పరుస్తూ, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

వెంకటపతిరాజు ఆకస్మిక మృతి



వెంకటపతిరాజు

బిక్కవోలు: రంగాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత కనుమూరి వెంకటపతిరాజు (65) గురువారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఎవరికి ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ రాజు భరోసా ఇచ్చి, సాయం అందించేవారు. పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ప్రస్తుతం గ్రామ సచివాలయ కన్వీనర్‌గా సేవలందిస్తున్నారు. ఆయన మృతికి సర్పంచ్ గండికోట వీరభద్రరావు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కనుమూరి సాయిరాజు, పంచాయతీ వార్డు సభ్యుడు శ్రీను తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్
- శ్రీరంగపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వం



శ్రీరంగపట్నంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న జక్కంపూడి గణేష్

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్ అన్నారు. గురువారం కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జక్కంపూడి గణేష్ గ్రామంలోని ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలను తెలియజేసి, వాటి ద్వారా పొందుతున్న లబ్ధిని వివరించారు. అనంతరం గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాల రమణ, చాటపర్తి దుర్గారావు, కొయిడాల నానాజీ, సూరిశెట్టి కుటుంభరావు, ఎంపీటీసీ తనకాల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి జరగలేదంటే ప్రజలే బుద్ధి చెబుతారు

టీడీపీ నేత వంగలపూడి అనితపై
రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధీ జరగలేదని, ప్రజా సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని ప్రజల ముందుకు వెళ్లి చెబితే వారే బుద్ధి వచ్చేలా టీడీపీ నేతలకు సమాధానం చెబుతారని రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కంబాల చెరువు సెంటర్‌లోని ఈట్ అండ్ ప్లేలో ఆమె గురువారం విలేకర్లతో మాట్లాడారు. రాజమహేంద్రవరం తిలక్ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఇటీవల తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి జరగడం లేదని, అదేవిధంగా ఆదిరెడ్డి అప్పారావు, వాసులది అక్రమ అరెస్టులని చేసిన వ్యాఖ్యలను షర్మిలారెడ్డి ఖండించారు. ఏ తప్పూ, అక్రమాలు చేయకపోతే ఆదిరెడ్డి తండ్రీ కొడుకులను సీఐడీ ఎందుకు అరెస్టు చేస్తుందని, జగజ్జనని చిట్ ఫండ్ కంపెనీలో అక్రమాలు జరిగాయి కాబట్టే చర్యలు తీసుకున్నారని అన్నారు. తప్పు చేస్తే తమ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన, మన అనే భేదం లేకుండా ఒకేలా చర్యలు తీసుకుంటారనే విషయాన్ని గతంలో జరిగిన చాలా సంఘటనలు తెలియజేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగడం లేదని ప్రజల ముందుకెళ్లి మాట్లాడితే తరిమి కొడతారని అన్నారు. ఇక వంగలపూడి అనిత విషయానికి వస్తే వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గాలికి ఎగిరిపోయిన ఆమె మాటలు కూడా గాలి మాటలేనని, విషయ పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు, లోకేష్ రాష్ట్రంలో ఎక్కడ ఏం జరిగినా దానికి తమ పార్టీకి, జగన్‌మోహన్‌రెడ్డికి ఆపాదించడం సరి కాదని షర్మిలారెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ తమ వైఎస్సార్ సీపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని అధికారంలోకి వస్తుందని చెప్పారు. విలేకర్ల సమావేశంలో రాష్ట్ర గాండ్ల, తెలుకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీప్రియ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఫ్లోర్‌లీడర్ పోలు విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు ఈతకోట బాపన సుధారాణి, మజ్జి నూకరత్నం, అనుసూరి పద్మలత, బళ్లా సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకురాలు నిరీక్షణ జేమ్స్, కొత్త విజయ రాజ్యలక్ష్మి, సాలా సావిత్రి, కాటం ప్రియాంక, గుడాల ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలకు ట్రస్టు బోర్డుల నియామకం

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం నగరంలో దేవదాయ శాఖ నిర్వహణలో ఉన్న పలు దేవాలయాలకు పాలక మండలి కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్టు ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. ఆయా ఆలయాల ట్రస్టు బోర్డు చైర్మన్లు, కమిటీ సభ్యుల పేర్లను గురువారం ఆయన మీడియాకు వెల్లడించారు. శ్రీ మార్కండేయేశ్వర స్వామి దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్‌గా ఇన్నమూరి ప్రదీప్, శ్రీ సత్యనారాయణ స్వామి వారి దేవస్థానానికి చైర్మన్‌గా దుంగా మంగాలక్ష్మి, గౌతమీ జీవకారుణ్య సంఘ చైర్మన్‌గా బర్రే కొండబాబు, చందా సత్రానికి పుట్టా శ్రీ కొమారి రామశర్మ, సారంగధరేశ్వర స్వామి వారి దేవస్థానానికి చవ్వాకుల సుబ్రహ్మణ్యం చైర్మన్లుగా నియమితులయ్యారని తెలిపారు. పందిరి మహాదేవుడు సత్రానికి ఇంకా పాలక మండలిని వేయాలని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. జాంపేట, వేణుగోపాలస్వామి, కన్నమాంబ, విశ్వేశ్వర స్వామి తదితర ఆలయాలకు కమిటీలను వేయాల్సి ఉందని, రూరల్ కో ఆర్డినేటర్‌తో చర్చించి వాటిని కూడా పూర్తి చేస్తామని ఎంపీ భరత్ తెలిపారు.

ఘనంగా పూజలు

బిక్కవోలు: శ్రీ విశాలాక్షి సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా రెండో రోజైన గురువారం మెళ్లూరులో మేధో దక్షిణామూర్తి, సరస్వతి పూజలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పెద్దిరెడ్డి సత్య సాయిరాం, సత్యకుమారి దంపతులు ప్రత్యేక పూజలు చేసి, విగ్రహాలకు అభిషేకాలు చేశారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.